## క్లుప్తంగా

### అధినేతను కలిసిన నాగరాజు



జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన నాగరాజు

వి.కోట: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని పార్టీ కార్యకలాపాలను, ప్రస్తుత పరిస్థితులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని అధినేత ఆయనకు మార్గదర్శనం చేశారు.

### పంటలపై ఏనుగుల దాడి



కోటపల్లె సమీపంలో ఏనుగులు ఆరగించిన అరటి చెట్లు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పాళెం పంచాయతీ పరిసర ప్రాంతాల్లో ఏనుగుల గుంపు గురువారం రాత్రి పంటపై దాడి చేసి నష్టం కలిగించాయి. పాళెం పంచాయతీ సమీప అటవీ ప్రాంతంతో తిష్ట వేసిన దాదాపు 14 ఏనుగుల గుంపు ఈ పరిసర ప్రాంతాల్లోనే తిరుగుతున్నాయి. వీటికి మరో మూడు ఏనుగులు జత చేరినట్లు అటవీ శాఖ సిబ్బంది తెలిపారు. పాళెం చుట్టు పక్కల గ్రామాల ప్రజలు రాత్రి పూట బయట సంచరించవద్దని, అప్రమత్తంగా ఉండాలన్నారు.

### నేరేడు కాయల మార్కెట్‌గా మారిన ఆస్పత్రి!



దారికి అడ్డంగా వాహనాలు నిలబెట్టి అల్లనేరుడు కాయల వ్యాపారం చేస్తున్న దృశ్యం

చౌడేపల్లె: స్థానిక ప్రభుత్వాసుపత్రి ముందు గురువారం అల్లనేరేడు కాయల మార్కెట్‌ను తలపించింది. మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆటోలలో అల్లనేరేడు కాయలు తీసుకొచ్చి, ఆసుపత్రి ఆవరణలో బాక్సుల్లో నింపి, బొలెరో వాహనంలోకి లోడింగ్ చేశారు. రోగులు లోపలికి వెళ్లేందుకు అడ్డుగా ఉండడంతో ఇబ్బందులు పడ్డారు. 108 అంబులెన్సు వెళ్లే ప్రదేశంలో ఈ వ్యాపారం సాగించారు. ఆసుపత్రి ప్రదేశంలో మార్కెట్ నిర్వహించడం ఏమిటని? పలువురు మండిపడ్డారు.

### నట్టల నివారణ మందులు పంపిణీ



సోమలలో గొర్రెలకు నట్టల నివారణ మందులు తాపిస్తున్న డాక్టర్ చందనప్రియ

సోమల (చౌడేపల్లె): గొర్రెలు, మేకల కడుపుల్లోని పరాన్నజీవుల నిర్మూలనకు ప్రభుత్వం ఉచితంగా నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తోందని, దీనిని గొర్రెలు, మేకల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ చందనప్రియ కోరారు.. గురువారం సోమల మండలంలో నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ, జూలై 10వ తేదీ నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తామన్నారు. మండలంలో 23,300 గొర్రెలు ఉన్నాయని, ఈ మందు వాటికి అందేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈ మందు తాపిస్తే మేకలు, గొర్రెల కడుపులోని హాని చేసే పురుగులు నాశనమవుతాయని, వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని తెలిపారు.

# విలీనం దెబ్బ
# చెప్పేదీ ఒక్కరే..వినేదీ ఒక్కరే..!

- వైఎస్సార్ సీపీ హయాంలో 23మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లు
- కూటమి పాలనలో అస్తవ్యస్తం
- విలీనం దెబ్బకు కకావికలం
- ముగ్గురు విద్యార్థులు ప్రైవేటు స్కూల్‌లో చేరిక
- బదిలీపై వచ్చిన టీచర్ సైతం మళ్లీ వెనక్కు
- బదిలీపై వెళ్లిన టీచర్ డెప్యుటేషన్‌పై రాక
- ఒకే విద్యార్థినికి పాఠం చెబుతున్న అయ్యోరు..!
- ఇక స్కూల్ చాప్టర్ క్లోజ్ అంటున్న గ్రామస్తులు



బూరగపల్లె పాఠశాలలో గిరీషాకు చదువు చెబుతున్న టీచర్ రవీంద్ర

చౌడేపల్లె: కూటమి ప్రభుత్వం మోడల్ ప్రైమరీ స్కూళ్ల పేరుతో గ్రామీణ పాఠశాలలను విలీనం చేయడంతో విద్యారంగం అస్తవ్యస్తం అవుతోంది. ఇప్పటికే జిల్లాలోపాటు చౌడేపల్లెలోని కొన్ని గ్రామాల్లో స్కూళ్ల విలీనంపై తీవ్ర వ్యతిరేకత, నిరసన వ్యక్తం కావడం, ఆందోళనలు సైతం చేయడం విదితమే. విలీనం ప్రభావం కొన్ని స్కూళ్లపై తీవ్రంగా పడింది. ఎంతగా అంటే విలీనం దెబ్బకు ముగ్గురు విద్యార్థులు ప్రైవేటు స్కూల్ బాట పట్టడంతో చివరకు ఒక్కే ఒక్క విద్యార్థిని మిగిలింది. కొసమెరుపు ఏమిటంటే ఆ స్కూల్‌కు ఇటీవలే బదిలీలలో ఒక టీచర్ సైతం రావడం..! వివరాల్లోకి వెళితే.. మండలంలోని బూరగపల్లె ప్రాథమిక పాఠశాలకు 4 దశాబ్దాల చరిత్ర ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ ఇద్దరు టీచర్లు, 23మంది విద్యార్థులు ఉండేవారు. నాడు–నేడు పథకం కింద కొన్ని అభివృద్ధి పనులు సైతం ఇక్కడ చేశారు. టాయిలెట్లు కట్టించారు. బల్లలూ ఇచ్చారు. చేతులు శుభ్రం చేసుకోవాలనికి మంచి వసతి కల్పించారు. కంప్యూటర్ కూడా ఉంటోంది. దీంతో ఇతర గ్రామాల నుంచి సైతం బాలలు వచ్చేవారు. కూటమి ప్రభుత్వ పాలనలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. దీంతో టీచర్ ఒక్కరే అయ్యారు. ఇక 3, 4,5 తరగతులను 3 కిలోమీటర్ల దూరంలోని గోనలపల్లెకు ప్రభుత్వం విలీనం చేసింది.

### ఇది కూడా మూసేస్తార్లేప్పా..!

'ఇప్పుడా ఇస్కూలుకిబోయే పిలకాయల్లేరు..పోయేదొకే పాప. ఆ పాపనీ వాళ్లమ్మానాయిన యాడైనా చేర్పిచ్చేస్తే ఆ స్కూల్‌ను మూసేస్తార్లేప్పా..!' ఇదీ గ్రామస్తులను సాక్షి పలకరించినప్పుడు చెప్పిన మాట. వాస్తవానికి గ్రామంలో 80వరకూ కుటుంబాలు ఉన్నాయి. ఊర్లోనే బడి అన్ని వసతులతో ఉన్నప్పటికీ 25మంది పైచిలుకు విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లకు వెళ్తుండటం గమనార్హం! కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ స్కూళ్లపై నమ్మకం సడలిపోతోందనడానికి ఇదో నిదర్శనంగా నిలిచిందని పరిశీలకులు అంటున్నారు.

### నలుగురు మాత్రమే మిగిలి.. మళ్లీ ముగ్గురు ప్రైవేటు బాట!

విలీనం దెబ్బకు 1, 2 తరగతుల విద్యార్థులు కేవలం నలుగురు మాత్రమే మిగిలారు. వాస్తవానికి ఇటీవల జరిగిన టీచర్ల బదిలీలలో ఇక్కడ పనిచేస్తున్న టీచర్ రవీంద్ర పరిగిదొనకు బదిలీ అయ్యారు. శాంతిపురం మండలం నుంచి సి.సునీత బదిలీపై ఇక్కడ చేరారు. ఆమె జాయిన్ అయ్యే నాటికి ఉన్న నలుగురు విద్యార్థుల్లో టపీమని ముగ్గురిని తల్లిదండ్రులు ప్రైవేటు స్కూల్లో చేర్పించారు. చివరకు 2వ తరగతి బాలిక గిరీషా ఒక్కటే మిగిలింది.! దీంతో స్కూల్‌కు కళ తప్పింది. ఫలితంగా సునీత్ రీబ్యాక్ అయి మళ్లీ శాంతిపురం మండలానికి వెళ్లిపోయారు. ఈ పరిస్థితుల్లో మళ్లీ అధికారులు రవీంద్రనే ఇక్కడికి డెప్యుటేషన్‌పై పంపారు. చివరకు ఆ స్కూల్‌లో ఒక గురువు, ఒక శిష్యురాలు మాత్రమే మిగిలారు.!!

## ప్రభుత్వం స్పందించకుంటే పోరాటం ఉధృతం



పుంగనూరులో రిలే నిరాహారదీక్షలు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పుంగనూరు(చౌడేపల్లె): ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకుంటే పోరాటం మరింత ఉధృతం చేస్తామని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద చేస్తున్న కార్మికులు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు గురువారం 13వ రోజుకు చేరాయి. వారు మాట్లాడుతూ, తమ న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని, 12 రోజులుగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్నా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని విమర్శించారు. తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు శ్రీరాములు, విజయ్‌కుమార్, శైలజ, వెంకటరమణ, సుబ్రమణ్యం, చంద్రశేఖర్, జగన్నాథరెడ్డి, ఆంజప్ప, మురళి, సుదర్శన్‌రాజు, శ్రీనివాసులు, హరి, జయకుమార్, శ్రీకాంత్, నాగిరెడ్డి, దాము, సురేంద్ర, బోయకొండప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మేమూ ఉన్నాం..గమనించుకోండి సార్!



తహసీల్దార్ శివయ్యను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

శాంతిపురం: కూటమి ప్రభుత్వంలో భాగస్వాములుగా తామూ ఉన్నామని స్థానిక బీజేపీ నాయకులు అధికారులకు గుర్తు చేశారు. మండల బీజేపీ నాయకులు గురువారం ఎంపీడీఓ కుమార్, తహసీల్దార్ శివయ్య, ఎస్ఐ నరేష్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ పథకాల అమలులో తమ పార్టీ వారికి కూడా అవకాశం కల్పించాలని, తమ సిఫార్సులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గజేంద్ర, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కాశీ విశ్వనాథశాస్త్రి, నాయకులు కుమార్, శివ, మహేంద్ర, వెంకటేష్ పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం: రాగి వైరు చోరీ

పుంగనూరు(చౌడేపల్లె): ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని రాగి వైర్లను చోరీ చేసిన సంఘటన పుంగనూరు మండలం పిచ్చిగుంట్లపల్లెలో గురువా రం వెలుగులోకి వచ్చింది. వివరాలు..గ్రామానికి చెందిన చెంగమ్మ, నాగవేణిల పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్‌ను కాపర్ దొంగలు పగలగొట్టారు. దానిలోని 25 కిలోల రాగి వైరును చోరీ చేశారు. పొలాల వద్దకు వెళ్లి న రైతులకు ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తించారు. దొంగలపనేనని గ్రహించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



పుంగనూరులో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో ఏర్పాటు చేసిన మానవహారం

పుంగనూరు(చౌడేపల్లె): యువత మత్తుపదార్థాలకు బానిసలు కారాదని, వాటికి దూరంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, సీఐ సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని పుంగనూరులో ప్రైవేటు కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి అధికారులు, పోలీసులు గోకుల్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు వాడకంతో జీవితాలు నాశనమవుతాయన్నారు. డ్రగ్స్ వాడకం వలన కలిగే నష్టాలను వివరించారు. మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై ప్రతి కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రధాన కూడలి ప్రాంతాలలో వద్దు...వద్దు...గంజాయి వద్దు అంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేసి పట్టణ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఎవరైనా మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న పక్షంలో వారి సమాచారం పోలీసులకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ కేవీ.రమణ, అలాగే బసవరాజ కళాశాల ప్రాంగణంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇదే కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యాయవాది టివి.రమణ మాట్లాడారు. డ్రగ్స్ విక్రయిస్తు పట్టుబడితే జైలుశిక్షతో పాటు అధిక మొత్తంలో జరిమానా చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ మురళీధర్, లెక్చరర్ మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

**పలమనేరులో..**

పలమనేరు: యువత మారక ద్రయ్యాలకు దూరంగా ఉండాలని పలమనేరు డీఎస్పీ డేరంగుల ప్రభాకర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశుల ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మారక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి విచ్చేశారు. కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ, యువత సోషల్ మీడియా ప్రభావంతో డ్రగ్స్‌కు అలవాటు పడుతోందని, ఓ యువకుడు డ్రగ్స్‌కు అలవాటు పడితే ఆ కుటుంబం మొత్తం నష్టపోతుందనేది గుర్తెరగాలని హితోక్తులు పలికారు. అనంతరం విద్యార్థులతో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

**గుడుపల్లెలో..**

గుడుపల్లె: యువత మాదకద్రవ్యాలకు బానిసలు కారాదని ఎస్ఐ శ్రీనివాసులు అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గుడుపల్లె వరకు విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడారు. కుటుంబానికి ఆధారమైన వారు మాదక ద్రవ్యాలకు బానిసలైతే ఆ కుటుంబాలు విచ్ఛిన్నం అవుతాయన్నారు. మాదక ద్రవ్యాలను ఎవరైనా విక్రయిస్తే తమకు సమాచారమివ్వాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణమనాయుడు, ఎక్సైజ్ ఎస్సై మోహన్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.



పలమనేరు: మాదక ద్రవ్యాల జోలికి వెళ్లబోమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు



గుడుపల్లె: మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

## నోటీస్ బోర్డు

### 28న ఉచిత కంటి వైద్య శిబిరం

పుంగనూరు(చౌడేపల్లె): పుంగనూరు పట్టణంలోని తాటిమాకులపాలెం రోడ్డులో విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఈనెల 28న శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు చెంగారెడ్డి తెలిపారు. శిబిరంలో చెన్నై శంకర్ నేత్రాలయ కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు రోగులను పరీక్షిస్తారని, ఎంపిక చేసిన రోగులకు చెన్నైలో కంటి ఆపరేషన్లు చేసి, తిరిగి స్వస్థలాలకు చేరుస్తారన్నారు. పుంగనూరు పరిసర మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### వైఎస్సార్‌సీపీ మండల కమిటీ నియామకం

వి.కోట: వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపక అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల పార్టీ నూతన కమిటీని నియమించినట్లు పార్టీ మండల కన్వీనర్, ఎంపీపీ యువరాజ్ గురువారం తెలిపారు. వైస్ ప్రెసిడెంట్లుగా శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, జనరల్ సెక్రటరీలుగా రఫీ, కృష్ణమూర్తి, నారాయణస్వామి, వెంకటరెడ్డి, సెక్రటరీలుగా సతీష్, గోవిందప్ప, నారాయణరెడ్డి, జాని, ఆసీఫ్ కార్యనిర్వాహక సభ్యులుగా అమీర్, రాము, రమేష్‌రెడ్డి, ఆనంద్‌రాజు, లతీఫ్, షామీమ్, సరస్వతి, రమేష్, మంజు, సుబ్రమణ్యం, నజీర్, వెంకటేష్ తదితరులను ఎంపిక చేసినట్టు ఆయన తెలిపారు.

### జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి

పలమనేరు: పట్టణ సమీపంలోని కోర్టుల్లో జూలై 5న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ కోరారు. స్థానిక కోర్టులో గురువారం ఆయన జూనియర్ సివిల్ జడ్జి లిఖిత తో కలిసి సీఐలు, ఎస్‌లు, మండల న్యాయ సేవాధికారిక సంస్థ, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కక్షిదారులు అనవసరమైన పంతాలకు పోకుండా రాజీ మార్గమే రాజమార్గంగా గుర్తెరిగి కేసులను రాజీ చేసుకుని శాంతిపూర్వకంగా జీవించాలన్నారు. ప్రిలిటిగేషన్ కేసులు, చెక్‌బౌన్స్, జీవనాధారం, వేధింపులు, గృహహింస తదితర సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకునేందుకు ఇది మంచి అవకాశమన్నారు. ముఖ్యంగా పోలీసులు పెండింగ్ కేసుల రాజీకి కృషి చేయాలని ఆదేశించారు.

### మానసిక వైద్యురాలి నియామకం



సౌమ్యశ్రీ మయూర్

గుడుపల్లె: పీఈఎస్ ఆసుపత్రిలో చిన్న పిల్లల మానసిక వైద్య నిపుణురాలిని నియమించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ సుబ్రమణ్య తెలిపారు. బెంగళూరులోని నిమ్‌హాన్స్‌లో చిన్న పిల్లల కౌమారదశ సీనియర్ కన్సల్టెంట్‌గా పనిచేసిన డాక్టర్ సౌమ్య శ్రీ మయూర్‌ను యాజమాన్యం నియమించిదని చెప్పారు. చిన్నపిల్లల మానసిక సమస్యలకు మరింత మెరుగైన సేవలు పొందవచ్చన్నారు.

### మహిళా సాధికారతే లక్ష్యం



ఆర్‌పీలకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న దృశ్యం

పలమనేరు: మహిళా సాధికారితే ప్రభుత్వ లక్ష్యమని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మెప్మా సభ్యులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘ సభ్యుల జీవనోపాధుల కోసం తగిన సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. మహిళా సంఘాల ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నామని, ప్రతి మహిళా ఓ వ్యాపారవేత్త కావాలని ఆకాంక్షించారు. అనంతరం ఆర్‌పీలకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, మెప్మా నిర్వాహకులు బాబా, సిబ్బంది పాల్గొన్నారు.

### మహేశ్వరికి నివాళి

సదుం: స్థానిక బీసీ బాలికల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ మహేశ్వరి గురువారం అంత్యక్రియలు పాలమందలో నిర్వహించారు. ఆమె అస్వస్థతకు గురై మరణించడం విదితమే. ఆమె మృతదేహానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ, కవితమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, ఎంపీపీ మాధవి, సర్పంచ్ మనోహర్ రెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే పలువురు టీచర్లు, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు అంత్యక్రియలకు హాజరయ్యారు.

అయ్యో పాపం: ఇలా నిద్రపోవడమూ కష్టమే





కిలోమీటర్ల పొడవునా నిలిచిన మామిడి ట్రాక్టర్లు



రోడ్డు పక్కన నిద్రిస్తున్న డ్రైవర్లు, రైతన్నలు



అన్‌లోడింగ్ కాకపోవడంతో ట్రాక్టర్ కింద నిద్రిస్తున్న డ్రైవర్లు

## ఎంత కష్టం..ఎంత దైన్యం

గుడిపాల మండలంలో మామిడి రైతుల కష్టాలు తీరడం లేదు. అసలే ధర పతనం కాయల విక్రయానికి నానా కష్టాలు పడుతున్న రైతన్నలకు మామిడి గుజ్జు పరిశ్రమల వద్ద రోజుల తరబడి పడిగాపులు మరింత దురవస్థలోకి నెట్టివేస్తున్నాయి. మూడు రోజులైనా ట్రాక్టర్ల నుంచి మామిడి కాయలను అన్‌లోడ్ చేసుకోకపోవడంతో రోడ్డుపై పడి నానా అగచాట్లు పడుతున్నారు. మండలంలోని ఫుడ్ అండ్ ఇన్స్ జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద సుమారు 400 ట్రాక్టర్లు, టాసా జూస్ ఫ్యాక్టరీ వద్ద 300 ట్రాక్టర్లు లోడింగ్ కోసం నిరీక్షిస్తున్నాయి. రోజులు గడుస్తున్నా ఎక్కడ నిలిపిన ట్రాక్టర్లు అక్కడే ఉండాల్సిన పరిస్థితుల మూలాన నిద్రాహారాలు లేక అల్లాడుతున్నారు. అలసిసొలసి కొందరు ట్రాక్టర్ మీదనే డ్రైవింగ్ సీట్లు, మరికొందరు ట్రాక్టర్ కింద, రోడ్ల పక్కన నిద్రించాల్సి వస్తోంది. జిల్లా కలెక్టర్ ప్రతి ఒక్కరికీ భోజన సదుపాయం కల్పిస్తున్నా ఇక్కడెవరూ ఆహార పొట్లాలు కూడా ఇచ్చే దిక్కు లేదు. గురువారం రైతన్నల అగచాట్లను సాక్షి క్లిక్‌మనిపించింది. –గుడిపాల

## బీసీ సంక్షేమానికి రాజీలేని పోరాటం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాజీ లేని పోరాటం చేస్తుందని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీ సంక్షేమ సంఘాన్ని పటిష్టపరిచి, ఉద్యమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలనే సదుద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటన చేస్తున్నానన్నారు. ఇందులో భాగంగా ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాయలసీమ న్యాయవాదుల సంఘం నూతన అధ్యక్షుడిగా చిత్తూరు నగరానికి చెందిన హరిప్రసాద్‌ను ఎన్నుకున్నామన్నారు. ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మేదర చంద్రను, చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా సెల్వకుమార్‌ను నియమించామన్నారు. ఇక దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టేలా కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. రాజకీయాల్లోనూ బీసీ మహిళలకు కేటాయించే రిజర్వేషన్లను కేంద్రం స్పష్టంగా పేర్కొనాలన్నారు. కులగణన చేయడం ద్వారా అర్హులైన బీసీలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఆయన అభివర్ణించారు. అనంతరం నూతనంగా నియమితులైన వారికి నియామకపత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు /స్గాన జగదీష్ తదితరులు పాల్గొన్నారు.